
భూ భారం

# పెరిగి పోతూంది

వేణుగోపాల్ నాయుడు



874.8274
VEN



Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

మాంత్రికుని మోకు
ఎంత పైకి పోతే అంత వింత

సంతాన తంతువు
ఎంత పైకి పోతే అంత వంత

With the best Compliments of The Author
13.8.80

# భూ భా రం
# పెరిగిపోతూంది


యన్. వేణుగోపాల్ నాయుడు

రిటైర్డ్ డెప్యూటి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్
ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్



DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11161

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
11161



*Published by*

**THE VANGUARD VENTURES**

4-8-61 Putli Bowli
Hyderabad — 500 001.

First Impression – 2,000 Copies. Feb. 1980.

894.8274
VEN

*This book has been selected for National Award in the Twentieth Prize Competition of manuscripts for neo-literates. Vide. D. O. No. F. 1-6/79-DIII (A.E.) dated 20 March 79. Government of India, Ministry of Education & Social Welfare, Department of Education, New Delhi, (110001).*

**All Rights Reserved**

Text Printed at THE VIVEKANANDA PRESS, Lakdi-ka-Pul, Hyd-4.
Wrapper & the Colour Plates Printed at THE PRAGATI ART PRINTERS, Lakdi-ka-Pul, Hyderabad-4. (5000 04)

AOUA102B.129

ఇప్పుడిప్పుడే అక్షరాస్యులగుచున్న

వారికందరికీ ఇది సమర్పితం

## ఈ పుస్తకాన్ని గూర్చి

## ముందు మాటగా మూడు ముక్కలు —

దీనికి 1979 లో జాతీయ అవార్డు లభించింది. అంటే మన దేశమంతటా ప్రాంతీయ భాషల్లో కొత్తగా చదువనూ రాయనూ నేర్చుకొన్న వారికి ఉపయోగపడేట్లు రాసిన పుస్తకాల్లో ఉత్తమమైందిగా భారత ప్రభుత్వంచే ఎంపిక చేయబడింది.

చిన్న కుటుంబాలు మనకూ మనదేశానికీ క్షేమదాయకమన్నదే ఇందలి సందేశం. దీన్ని బలపరచే కారణాలు కొన్ని వివరించబడ్డాయి. దీన్ని ఒకటికి నాలుగుసార్లు చదవండి. చదివి ఆలోచించండి. ఇచ్చిన సలహా సబబైనదని తోస్తే ఆచరణలో పెట్టండి. అంతే.

ప్రభుత్వం తలపెట్టిన యీ మహత్కార్యం జయప్రద మయిందన్న మాటే.

రచయిత

# ఈ పుస్తక రచయితను గూర్చి

విందు భోజనానికి ముందు అతిథులు తెలుసుకొనేది – వంటా వార్పూ - ఎవరూ ? అని. ఫలానా హోటల్‌వాండ్లకేర్పాటు చేశారంటే - "అయితే ఇంకేం ? పసందుగానే వుంటుంద"ని ఉత్సాహంతో తయారవుతారు భోక్తలు.

పుస్తకాల సంగతీ అంతే. మొదటిపుట తిరగేసే ముందు పుస్తకాన్ని చేతి కందుకోగానే 'రాసినవారెవరా ?' అని చదువరులు చూడడం సహజం. రచయితను బట్టి రాత 'ఎలా వుంటుందో' ఊహించుకొంటారు. కాబట్టి రచయితను గూర్చి కొంత చెప్పాల్సిందే.

దీన్ని రాసింది సైన్సు శాస్త్ర విషయాలను తెలుగువారికందించడంలో అనుభవమున్నవారు, ఇంతకు పూర్వం యీయన రాసిన పుస్తకాలు ;

విశ్వ ప్రతిష్ఠ (పరమాణువాదాన్ని గూర్చి)
మెండలీయము - రక్తస్పర్శ (ఆనవాయితీని గూర్చి)
రమ్యహర్మ్యము (మన దేహాన్ని గూర్చి)
గగనగమనము (విమానాలను గూర్చి)


ఇవికాక ఇ-కాకొన్ని పాఠ్య గ్రంథాలు పత్రికల్లో వ్యాసాలు.
సైన్సు పుస్తకాల రచయితగా అందుకొన్న అవార్డులు :

మద్రాసు విశ్వవిద్యాలయం వారిచే - 1946 లో రమ్యహర్మ్యానికి.
తెలుగు భాషా సమితి వారిచే — 1948 లో రమ్యహర్మ్యానికి.
మద్రాసు విశ్వవిద్యాలయంవారిచే — 1950 లో —గగనగమనానికి
భారత ప్రభుత్వంచే — 1979 లో యీ పుస్తకానికి.

ఇక ఆలస్యం దేనికి, రచయిత చెప్పదలచుకున్నదేంతో వుండచ్చు. ఆ చెప్పేది సూటిగా మనసులో నాటేట్లు చెప్పే సామర్థ్యమున్న వారే. మిమ్మల నాకట్టుకొంటారనడంలో సందేహంలేదు.

ప్రకాశకులు








# పెరిగిపోతూంది....

ఏది ?

మాకులుకావు, మనుజులసంఖ్య. ప్రపంచజనాభా. ఈపెరుగుదల నాపలేమా ?


తీర్థయాత్రలప్పుడు త్రివేణిసంగమందగ్గర, హరిద్వారంవద్ద గంగానది ఒడ్డున, తీర్థాలప్పుడు ఎక్కడైనాసరే, ఎప్పుడైనాసరే హౌరాబ్రిడ్జిదగ్గర ఉదయాన్నే, సాయంత్రం ఒక్కసారి దృష్టిసారించి నలువైపులా చూడండి - ఎక్కడలేని జనం; కుడివైపున జనం; ఎడం వైపునజనం; ముందుచూస్తేజనం; వెనకచూస్తేజనం; ఎటుచూచినా జనం ... జనం ... జనం ... ఇసుకవేస్తేరాలదు. 'నేలయీనినట్లు నిండెదరండు' అని కవి వర్ణించిన కపిసైన్యం ఈలాగే ఉండేదేమో !

హోటళ్ళలో, సినీమాల్లో, రైల్వేస్టేషన్లలో, బస్సుస్టేండులలో, రాజవీధుల్లో ఎక్కడబడితే అక్కడ మనకెదురయ్యేది జనసందోహం. విమానప్రయాణాలు, బస్సులరాకపోకలు, రైళ్ళు ఎంత ఎక్కువ జేసినా అంతకంత ప్రయాణీకులు ఎక్కువవుతున్నారు. స్కూళ్ళల్లో, కాలేజీల్లో, యూనివర్సిటీల్లో పరిమితికి మించి విద్యార్థులెగబడు తున్నారు. రెట్టింపుసంఖ్యలో ప్రవేశమిచ్చినా, షిఫ్టుపద్ధతి వమల్లో పెట్టినా, ఇంకా అనేకులు మిగిలిపోతున్నారు. పేదరికం తాండవ మాడుతూంది. నిరుద్యోగసమస్య తీవ్రతరమవుతూంది. నేరాలసంఖ్య అధికమవుతూంది. దీనికంతా కారణం విచ్చలవిడిగా పెరిగిపోతూన్న జవసందోహం.




ప్రపంచజనాభా శీఘ్రంలోనే నాలుగు లక్షల కోట్లు కాబోతూంది. కోటానుకోట్ల సంవత్సరాల క్రితం మానవుడు ప్రపంచంలో అడుగు పెట్టిందిమొదలు 1830 దాకా పెరిగిన ప్రపంచ జనాభా ఒకే ఒకలక్షకోట్లు (1,000,000,000,000). అది ఒకశతాబ్దం తర్వాత, అంటే 1930 నాటికి రెండింతలైంది. మరి ముప్పైఏండ్లలో అది మూడు లక్షలకోట్లకు పెరిగింది. ఇంకో పదహారేండ్లకంతా (1976 నాటికి) నాలుగులక్షల కోట్లయింది. ఈ శతాబ్దాంతానికి ఇదే జనాభా రెండింతలైపోగలదని భావిస్తున్నారు.

ప్రపంచంలో ప్రతిసెకండుకు నలుగురు పిల్లలచొప్పున దినానికి మూడు లక్షలానలభయి అయిదువేల ఆరువందల పిల్లలు పుడుతున్నారు. అంటే ప్రతి సంవత్సరం పన్నెండుకోట్ల అరవైఒక్కలక్ష నలభైనాలుగువేలమంది ప్రపంచజనాభాకు అదనంగా చేరుతూ ఉంటారు. ఇందులో మృతులసంఖ్య రమారమి అయిదుకోట్ల యాభైలక్షలు పోయినా, నికరంగా ఏడుకోట్ల పదకొండులక్షల నలభైనాలుగువేల మంది జనాభాను చేరుకోవడంఖాయం !





ప్రతి సెకండుకు నలుగురు పిల్లలు



ప్రపంచజనాభాలో మూడింట రెండుపాళ్ళు ఇంకా అభివృద్ధి చెందుతూన్న, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలాంటి దేశాల్లో ఉంటున్నారు. ఆసియా ఖండంలో భూభాగం ఎక్కువకాబట్టి, ప్రపంచంలోని జనులలో సగానికి సగంపైగా ఆసియాలోనే ఉంటున్నారు. జనసంఖ్యలో చైనాదేశానిదే అగ్రస్థానం. తరువాత మనదేశం. 1951 లో మనదేశంలోఉండిన ముప్పైయేడుకోట్ల నలభై లక్షలజనం 1976 లో ఆమాంతంగా అరవై రెండుకోట్లుయికూర్చుంది. ఈ యిరవై దేండ్లలో (1951-1976) ఇరవై నాలుగుకోట్ల అరవైలక్షల జనం అదనంగా చేరుకున్నారు. సంవత్సరానికి సగటు పెరుగుదల 1951 కి పూర్వంకంటే ఎంతో ఎక్కువైంది.

మనరాష్ట్రంసంగతి చూద్దాం. 1971 జనాభాప్రకారం మన రాష్ట్రజనసంఖ్య నాలుగుకోట్ల ముప్పైఅయిదులక్షలు. 1972-73 నాటికి ఇది నాలుగుకోట్లనలభై యెనిమిదిలక్షలైంది. ఒకవైపు కుటుంబ నియంత్రణ ధర్మమా అంటూ పుట్టేవారి సంఖ్య తగ్గుతూఉన్నా ఈ జనాభా పెరుగుదలకు కారణం లేకపోలేదు. ముఖ్యంగా ప్రస్తుతం పెరిగిన మన సగటు ఆయుర్థాయం ఒక కారణం.


'సగటు ఆయుర్థాయమేమిటి? పెరగడమేమిటి?' అంటారా.




రైళ్ళలోనికి మనుషులను నెట్టే పోలీసులు. పనివారలను ఫ్యాక్టరీలకు చేరవేయడానికి ఎన్ని రైళ్ళున్నా చాలవు.

---

ఎక్కడైనా సరే ఎవరైనా సరే మరణిస్తే చట్టప్రకారం విర్ణీత గడువులోపల గ్రామంలోనైతే గ్రామ మునసబుకు, పట్టణాల్లోనైతే మునిసిపాలిటీవారికో, కార్పొరేషనువారికో జనన-మరణ తాలూకు అధికారికి మరణించిన వ్యక్తి పేరు, వయసు, మరణకారణం వగైరా వివరాలు తెలియజేయాలి. ఒక గ్రామంలో ఒకవందమరణాలు ఒకసంవత్సరానికి నమోదైందనుకుందాం. ఇందులో చచ్చి పుట్టినవారొక పది మంది ఉంటారనుకుందాం. వారివయసు సున్న సంవత్సరాలు; ఒక సంవత్సరమునుండి అయిదేండ్లలోపువారొక ఇరవైమంది; ఆరేండ్ల మండి ఇరవైఏండ్లలోపువారు ముప్పదిమంది; ఇరవైఒకటినుండి యాభైఏండ్లలోపువారు ఇరవైమంది; యాభైఒకటినుండి ఎనభైయేండ్లలోపువారు పదిహేనుమంది; ఎనభైఒకటినుండి నూరేండ్లలోపువారు అయిదుగురున్నారనుకుందాం. ఒక్కొక్కవయః పరిమితిలోని వారి సగటు వయసు తీసికొని ఈ వయః పరిమితితో మర




ణించిన వారిసంఖ్యతో హెంచితే, ఇన్ని సంవత్సరాలనివస్తుంది. ఒక సంవత్సరంనుండి అయిదేండ్లలోపు వయసువారు ఇరవై మంది ఉన్నారనుకొన్నాం గదా. వీరందరిసగటు వయసు 2 ఏండ్లు (5-1 = 4/2). వీరి మొత్తంవయసు $20 \times 2 = 40$ ఏండ్లవుతుంది. ఈలాగే ప్రతి వయః పరిమితిలోని వారిలెక్కలుకట్టి వందతో భాగిస్తే (మొత్తం వందమందిని అనుకొన్నాం గనుక) చనిపోయినవారి సగటు ఆయుర్దాయం వస్తుంది. సంవత్సరంలో వందమంది పోయిన ఈ గ్రామప్రజ ఆయుర్దాయం ఏడున్నరసంవత్సరాలొస్తుంది. అంటే ఇక్కడ చాలామంది అకాల మరణంపాలయ్యారన్నమాట. ఈలా అన్ని గ్రామాలనుండి, అన్ని తాలూకాలనుండి, అన్నిజిల్లాలనుండి, అన్ని రాష్ట్రాలనుండి సేకరించబడిన లెక్కలనాధారంగా గొని గ్రామ స్థాయిలో, తాలూకాస్థాయిలో. జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో, దేశం మొత్తంమీదగూడా సగటు ఆయుర్థాయం కనిపెడతారు. మన రాష్ట్రంలో ఈలా కనిపెట్టబడిన సగటు ఆయుర్థాయం 1960 లో 40 సంవత్సరాలు; 1963 లో 44 సంవత్సరాలు; 1968 లో 48 సంవత్సరాలు. అంటే రానురాను మనిషి ఆయుర్దాయం పెరుగు




తూందన్నమాట. ముందున్నంతగా పురిటిలోనే సంధిగొట్టిపోయిన
వారిప్పుడరుదు. శిశుమరణాలిప్పుడట్టేలేవు. స్ఫోటకము, కలరా,
మలేరియా వంటి అంటువ్యాధులవల్ల మరణాలు చాలా మట్టుకు
తగ్గాయి. మనుష్యుల ఆరోగ్యం చాలావరకు పెంపొందింది. మనిషి
ఆయుర్దాయం పెరిగింది. ఈలా అనేక కారణాలవల్ల పుట్టేవారిసంఖ్య
పెరుగుతూ గిట్టేవారిసంఖ్య తరుగుతూఉంటే దేశజనాభా చుక్కలంట
కేం చేస్తుంది ?

థామస్ మాల్థస్ (1766-1834) అనే ఆయన ఇంగ్లండులో మంత్రిగా నున్నప్పుడు, అదుపుతప్పి అంతకంతకు మితిమీరి పెరిగి పోతూన్న జనాభా ప్రపంచానికో పెద్దప్రమాదంగా పరిణమించ బోతూందని ఏనాడో అన్నాడు.

జనాభా పెరిగితే యేం ? స్థలం చాలకపోతుందనా ? జనం లేనిస్థలాలు భూమ్మీద ఎన్ని లేవు? అక్కడంతా సర్దుకుంటేనో !

ఆహారం చాలకపోతుందని చింతా? చాలినంత ఆహార ధాన్యాల ఉత్పత్తి సాధించలేకపోతామా? ఏదైనా అవాంతరాల వల్ల ఉత్పత్తి తగ్గినా విదేశాలనుండి దిగుమతి చేసుకొనే స్థోమత మనకు లేకపోయిందా ?

'ఇంతమంది ఆరోగ్యాన్నేలా కాపాడగలుగుతామని బెంగా? దానికేం. సైన్సువృద్ధికాదా? రకరకాల క్రొత్తఔషధాలనుత్పత్తి చేయలేమా? వైద్యుల్ని తయారుజేయలేమా? ఆస్పత్రులని, డిస్పెన్సరీలని, నర్సింగుహోములని, యెన్నో యేర్పడకపోతాయా? మాల్థస్ కు మతిలేకపోతేసరి ఇందులో అంత భయపడాల్సిందేముంది గనక' అని అప్పటి వారు చులాగ్గా మాల్థసు సూచనను తోసి పారేశారు. ఆయన భయాందోళనలకే కారణమూ కనబడడంలేదను కొని, పైకి కాకపోయినా, లోలోన ఇంచుమించు అందఱు నవ్వు కొన్నవారే. ఇప్పటికి గాని ఆయన హెచ్చరికలోని యదార్థం మనకు తెలిసిరాలేదు

'అయితే ఇప్పుడు మనకెందులో కొఱతుంది? జనాభా ఎంత పెరిగితే ఏం? స్థలాభావమా? సేతుశీతనగపర్యంతం సుమారు ముప్పది రెండులక్షల ఎనభై వేల చదరపుకిలోమీటర్ల భూభాగంగల మన సువిశాల భారతదేశానికొచ్చిన ఇబ్బందేమిటి? కావలసినంతస్థలముంది. పుష్కలమైన పంటలున్నాయి. ప్రజారోగ్యాన్ని కాపాడడానికి మంచి ఔషధాలున్నాయి మనకు దేంట్లోకొఱతుంది గనక భయపడడానికి?' అని ధీమాగా నెలకోపది లక్షలమందిని పుట్టించి ప్రజా సంఖ్యకు చేర వేస్తూ వస్తే, దేశవైశాల్యం ఎంతైతేనేం? మనంచూస్తూండగానే కొన్నాళ్ళకు కిటకిటలాడిపోతుంది. నిల్చోడానికిగూడా స్థలముండదు. మనకు స్వరాజ్యంవచ్చినప్పటికి ఇప్పటికి మనజనసంఖ్య ఇరవై యేడు కోట్లు పెరిగింది 1971 లో ఉండిన ఏబదినాలుగుకోట్ల ఎనభై లక్షల

జనభా 1976కల్లా యాభై యెనిమిదికోట్లయింది. ఈలా వృద్ధిఅవుతూ పోతే ఇంకో ఇరవై రెండేండ్లలో మన జనసంఖ్య ఒక లక్షకోట్లయి (1,000,000,000,000) పోవచ్చు. అప్పటికైనా మనకు ఇండ్లకు, తిండికీ తిప్పలు తప్పవు.

మనదేశం సువిశాలమైనదే. ముప్పదిరెండులక్షల ఎనభై వేల చదరపు కిలోమీటర్లవైశాల్యంలో, నదీనదాలు, కొండలు, గుట్టలు, సరోవరాలు, సాగరతీర ముంపుప్రాంతాలు, అరణ్యాలు, ఎడారులు, పంటభూములు, పచ్చికబయళ్ళు లాంటి ప్రాంతాలు పోగా మిగిలిన వాసయోగ్యమైన స్థలం ఏ మాత్రముంటుంది? మితిమీరి పెరుగుతూన్న జనాభాకది యేమాత్రం సరిపోతుంది?

సరే. స్థలం చాలకపోతే ఇతర దేశాలకు మూట ముల్లె సర్దుకొని వలస పోవచ్చునంటారా? అది యాభై యేండ్ల క్రిందనైతే సులభసాధ్యమయ్యేదే. ఇప్పుడు ప్రపంచంలోని అన్ని దేశాలు వలసలను ప్రోత్సహించడంలేదు. ఒకానొకప్పుడవి అన్నీ ప్రజలు వస్తే చాలని వలసలను ప్రోత్సహించినవే. కారణాలేమైనా కానీండి - రాజకీయాలు కావచ్చు, మతపరంగా జరిగిన కొన్ని అసహన క్రియలే కావచ్చు, క్రొత్త ప్రదేశాలు కనిపెట్టాలన్న సాహసప్రియత్వమే కావచ్చు, ఇతర ప్రదేశాల్లో లభించగలదన్న ఖనిజసంపదలో, విధినిషేధాలో కావచ్చు - ఏదైనాసరే ప్రజలొకప్పుడు దూర దేశాలకు పోయి అక్కడక్కడా స్థిరపడిపోయారు. క్రొత్తచోట పరిస్థితులనుకూలంగా లేకపోయినా, అనేక కష్టాలనెదుర్కొని ప్రపంచం నలుమూలలా ప్రజలాక్రమించుకొన్నారు. ఇప్పటి అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజీలాండు - ఈలా వలసవచ్చిన వారితో ఏర్పడిన దేశాలే. ఇప్పుడీ దేశాలేవీ గూడా ఇతర దేశాలవారి స్థిరనివాసానికి తమ దేశాల్లో చోటివ్వడంలేదు. ఆస్ట్రేలియా, న్యూజీలాండులలో

తెల్లవారికి తప్ప ఇతరులకు ప్రవేశంలేదు. చదువురానివారికి, నేరాలు చేయడానికి అలవాటుపడ్డవారికి, దివాలాకోర్లకు, శారీరకంగా మానసికంగా వ్యాధిగ్రస్థులైనవారికి, దేశపు రాజకీయ సిద్ధాంతాలకూ, ఆర్థిక విధానాలకు ప్రతికూలురుగానున్నవారికి, కొన్ని దేశాలు శాశ్వతంగా ఆశ్రయమివ్వవు ఐశ్వర్యంతో తుల తూగుచు, ఆర్థికంగా అన్నివిధాలా ఉన్నతస్థాయినందుకొన్న అమెరికా వంటి దేశాలు విదేశీయుల ఉనికిని అంగీకరించవు. అచ్చటి ప్రజాజీవిత ప్రమాణం విదేశీయుల వల్ల పడిపోగలదని వారిభయం. ఇన్ని కారణాలవల్ల ఈనాడు వలసలు దుస్సాధ్యమైపోయినాయి. అన్నిదేశాలలో ఎక్కడ పుట్టినవారక్కడే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందువల్ల జపాను వంటి చిన్నదేశాలు ఎంత ఇబ్బంది పడుతున్నాయో చెప్పమంటారా? వినండి

జపాన్ ప్రాపంచిక పారిశ్రామిక దేశాల్లో మూడవస్థానాన్ని ఆక్రమిస్తుంది. అయిదింట నాలుగుపాళ్లు ఆ దేశమంతా పర్వత మయం. కనువిందేగాని ఆ పర్వతాలవల్ల దేశానికి కాణీ ఆదాయం లేదు. పరిశ్రమలకు, ఇండ్లకు, ఇతర కట్టడాలకు వ్యవసాయానికి, జపానులోని పదికోట్ల ప్రజ తక్కిన అయిదింట ఒకభాగం ప్రదేశం లోనే సర్దుకోవాలి. స్థలం ఖరీదు చుక్కలంటుతుంది. గౌజా (Gouja) లో ఒక చదరపు మీటరు స్థలం తొంభై నాలుగువేల రూపాయలు. అంటే ఒక చదరపుటడుగు ఖరీదు ఎనిమిదివేల ఎనభై అయిదు రూపాయలు! ఆశ్చర్యంగా ఉందా? టోక్యోకు కనీసం వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న శివార్లలో పదిహేను మీటర్ల వెడల్పు ముప్పదిమీటర్ల పొడవుగల ఇంటినివేశనం ధర మూడు లక్షల డెబ్బైయేడువేల రూపాయలుంటుంది. గుండె ఆగిపోలేదు గదా! ఈ ఖరీదు ఇంతతో ఆగదు. ఏడాదికేడాదికి ఎనిమిదో వంతు పెరుగుతూనే ఉంటుంది.

జపాన్‌లోని టోకియో నగరం ప్రపంచంలోకెల్లా పెద్దది. 1978లో దాని జనాభా కోటి పదిలక్షలు (1,10,00,000) 1985 కల్లా ఇది కోటి ముప్పై లక్షల (1,30,00,000) వుతుందని నిపుణుల అంచనా. ఈలా అదనంగా అంతంలేకుండా పెరిగిపోతూన్న ప్రజలందరికీ కనీసం నిలుచుండడానికైనా చాలిన స్థలాన్ని ఏలా సమకూర్చుతారు? కోట్లకొలది డబ్బు వ్యయంచేసి టోక్యోఖాతంలో సముద్రాన్ని కొంత పూడ్చివేసి ఏడు హెక్టార్లు (17,287 ఎకరాలు) సంపాదించారు. టోకియో ప్రాంతపు మిగతా సముద్రాన్ని పూడ్చివేస్తే, నలభై వేల హెక్టార్లు (98,824 ఎకరాలు) సమకూర్చవచ్చు. ఇది అదనంగా ఏబదిలక్షల జనానికి సరిపోవచ్చు.

అనువైన సముద్రప్రాంతాలు పూడ్చడమేకాక కొండ శిఖరాల్ని కొట్టి చదును చేసి కొండలమీద గుట్టల మీద పీఠభూముల్ని గూడా సృష్టిస్తున్నారు. జపాన్‌లోని కోబే (Kobe) నగరం ప్రపంచంలో రెండవ ప్రధాన పారిశ్రామిక పట్టణం. దీని జనాభా పదమూడులక్షలు. ఆ పట్టణ వాసులకు కావలసిన ఆరువేలారెండువందల ఇండ్లకు, పరిశ్రమలకు, రహదార్లకు, హార్బరుకు కావలసిన స్థలాన్ని ఈలా కొండ శిఖరాల్ని కూల్చి చదునుచేసిన పీఠభూములమీద సమకూర్చారు. ఇది ఒక దోవకు రావడానికి పదిహేడేండ్లు (1953-1970) పట్టింది. ఇంతేకాకుండా కృత్రిమంగా ద్వీపాలకు ద్వీపాలనే సృష్టించడానికి పూనుకొంటున్నారు. కోబేకు సమీపంలో ఈలాంటి ఒక ద్వీపనిర్మాణానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. దీనికి మున్నూట అరవైయారు కోట్లు ఖర్చవుతుందని అంటున్నారు. మొదలే భూమికి ముఖం వాచిన జపానువారికి, అంతంలేకుండా పెరుగుతుండే జనాభాకు. నిలుచుండేందుకైనా చోటు సమకూర్చడం

గడ్డు సమస్యగా తయారైంది. స్థల సేకరణకే ఈలా సతమత మౌతూంటే తిండికెన్ని తిప్పలుపడాలో!

మన దేశంలాగే జపానుగూడా ఆసియాఖండలో భాగమే. ప్రపంచ జనాభాలో నూటికి అరువది పాళ్ళు ఆసియావాసులే. ఇప్పటినుండి (1978నుండి) ఇరవై రెండేళ్ళలో, ఐరోపా జనాభా నాలుగింతలు అధికంగా ఉంటుందనడానికి ఆస్కారముంది, అంటే అప్పటికి ఈ ఖండంలో నాలుగువందల కోట్ల ప్రజలుంటారు. ఆసియా దేశాలలో - అంటే మనదేశం, మలేసియా, దక్షిణ కొరియా, ఫార్మోసా, థాయిలాండు, సింగపూర్. ఇరాన్, ఇండో ఆసియా మున్నగు దేశాలన్నింటిలో జనాభా పెరిగిపోతుంది. మును పటివలె దూర ప్రాంతాలకిప్పుడు ప్రజలు వలస పోవడానికి వలను పడదుగదా. ఎక్కడివారికక్కడే అన్ని సదుపాయాలూ సమ కూర్చాలి. జనాభా పెరగనివ్వకుండా అరికట్టడం, ఉన్నవారికి ఆహా రాన్ని సమకూర్చడం ఆయాదేశాలవారికో బ్రహ్మాండమైన సమస్యే.

అమెరికా కంటే సంపన్నదేశం ప్రస్తుతం మరొకటిలేదు. ఇది అందరికీ తెలిసిందే. అలాంటిదేశమే అంతకంతకు పెరిగి పోతూన్న జనాభాను చూచి హడలెత్తిపోతూంది. మనకూ ఇప్పటి లాగే అమెరికావారికి గూడా ఒకప్పుడు సంతాన నిరోధకత్వాన్ని గూర్చి కొన్ని పట్టింపులుండేవి. డాక్టరు బీస్లీ (Dr. Beasely) అనే ఒకాయన అమెరికాలో ఒక పరిశోధన జరిపాడు. 3168 వివాహితు లైన పురుషుల్ని, 15 నుండి 45 సంవత్సరాలమధ్య నున్న వివా హితులైన స్త్రీలను గర్భిణులగానున్నవారిని సందర్శించి కొన్ని

విషయాలను సేకరించాడు. ఒక్కొక్క స్థలంలో ప్రత్యక్షంగా చూచి తెలిసికొన్న అంశాలివి:

ప్రతి నూరుమంది స్త్రీలలో...

1. ఇరవయ్యారు మంది నిరుపేదలు. సంపద లేనివారికి సంతాన మెక్కువ కదా. అందుచే ఇందులో నూటికి (ఎ) యాభై యార్యురుమంది బ్రతికున్న పిల్లల్ను, డెబ్బదిరెండు మందిచచ్చిన వారిని కన్నారు. (బి) ఎనభై మంది బాలింతలుగా మరణించారు. (సి) ఎనభైతొమ్మిది మంది పిల్లలు కానీనులు. అంటే అవివాహితలైన వారికి (కన్యలకు) పుట్టినవారు.

2. పేదవారిలో నూటికి ఇరవైయెనిమిది మంది, మధ్య తరగతి కుటుంబాలలో నూటికి ఎనభైఅయిదు మంది ఏదో ఒకవిధమైన గర్భనిరోధకచర్యను రహస్యంగా చేసికొన్నవారే.

3. సామాన్యంగా ఒక పేదకుటుంబంలోని స్త్రీ, ఇరవైయారు సంవత్సరాలు నిండకపూర్వమే అయిదుగురు పిల్లల్ని కని పడేస్తుంది.

4. నూటికి అరవైమంది, ఇద్దరు లేక ముగ్గురు పిల్లలకంటె ఎక్కువ అక్కర్లేదన్న అభిప్రాయానికి వచ్చినవారే.

5. నూటికి డెభ్భైయిదు మంది 'ఇక పిల్లలొద్దు బాబోయి' అని ప్రసూతి వైరాగ్యాన్ని వరించారు.

6. అధిక సంతానాన్ని భరించలేక, కొందరు తండ్రులు నిస్పృహతో, కుటుంబాన్ని గాలికి వదిలి, చెప్పకా చెయ్యకా పలాయనమంత్రం పఠించారు. అజ్ఞాతవాసంలో బలవంత సన్యాసం స్వీకరించారు కాబోలు!

మొత్తంమీద పేదవాండ్లలో గర్భధారణ విషయమై పాదుకొనియుండిన గాఢమైన అజ్ఞానం బైటపడింది. గర్భం రాకుండా ఉండడాని కెట్టిసాయానైనా సంతోషంతో చేపట్టడానికి అందరు సంసిద్ధత వెలిబుచ్చారు. డాక్టరుగారు వెంటనే కార్యక్రమానికి పూనుకున్నారు. పిల్లల పుట్టుక నిరోధిస్తే ప్రజల సంఖ్య దానంతటదే పడిపోకతప్పదు. "ప్రథమంగా ప్రభుత్వ శాసనాలు సవరించాలి. కుటుంబ నియంత్రణ కేంద్రాలను చట్టసమ్మతం చేయాలి. గర్భస్రావాన్ని నేరంగా పరిగణించకూడదు". అని ప్రచారం సాగించాడు. గ్రామాలలో కుటుంబ సంక్షేమ వైద్యాలయాలు స్థాపించాడు. పేదప్రజలకు గర్భధారణ తాలూకు సలహాలు ఉచితంగా లభ్యపడేట్టు చూశాడు. కుటుంబ సంక్షేమ కేంద్రాలున్న గ్రామపరిసరాల్లో అనతికాలంలో నూటికి ముప్పదిరెండుకు జననసంఖ్య పడిపోయింది. ఇదే ఉద్యమాన్ని భారీయెత్తున న్యూ ఆర్లియాన్సు (New Orleans) లో నడిపాడు. రెండేండ్లలో మహత్తర ఫలితాలు సాధించగలిగాడు. ఇదంతా డాక్టరు బీస్లిగారి స్వచ్ఛందసేవ. ప్రభుత్వసాయ మేమాత్రంలేదు. ప్రజాదరణ, వారి సహకారమే ఆయనకు లభించిన సంపద. కాని ఇప్పుడో! ప్రజల సంఖ్య పెరుగుదలవల్ల రాగల అపాయాన్ని గుర్తించిన ప్రభుత్వం రంగంలోకి దూకింది. కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.


అమెరికా వారికెందులో కొరత. భూ వసతి తక్కువైందా? ఐశ్వర్యం లేకపోయిందా? అన్నిటికంటె పైగా ఎట్టి అసాధ్యమైన కార్యాన్నైనా ఇట్టే సాధించగలమన్న ఆత్మవిశ్వాసం గలవారు అమెరికన్లు. అట్టి మనోనిశ్చయం ధైర్య స్థైర్యాలకు పట్టుగొమ్మలైన అమెరికన్లే, పెరుగుతూన్న జనాభావల్ల 'దేశం ముందుగతి ఏమిటా?'అని ఆందోళనతో పుట్టుకల సంఖ్య తగ్గించడానికి అపార శ్రద్ధ వహిస్తూంటే, మనదేశంలాంటి బీదదేశాలు ఏంచెయ్యాలి?

"బాగుంది మీ వరస. దేశజనాభా పెరిగిపోతుందని వివాహాలు మానుకోమంటారా? వివాహం చేసుకొన్నా పిల్లల్ని కనవద్దంటారా? అయితే ఇక పెళ్ళెందుకు పెటాకులెందుకు? శుభ్రంగా సన్యాసం పుచ్చుకొని అరణ్యాలమీద బడిపోవచ్చునే. తండ్రైనవాణ్ణి పర లోకంలో పున్నామనరకంనుండి తప్పించడానికి, నెలకోమారు, సంవత్సరానికోమారు కాసిన్ని తిలోదకాలర్పించి గతులు కల్పించ డానికి పుత్రుడనువాడొక్కనలుసైనా లేకుంటే చచ్చిన తర్వాత మన గతేంకాను? పెండ్లైన తర్వాత, ఒక ఏడాదికో, రెండేండ్లకో మన మెవరినైనా కలిసినప్పుడు, 'అమ్మా నీకిప్పుడెందరు పిల్లలు?' అని అడుగుతారు కాని తక్కిన ఆస్తిపాస్తుల వివరాలడగరు. సంతాన మెంత ముఖ్యమైందో చెప్పడానికింతకంటె నిదర్శనం కావాలా? సంతానం కోసం ఎందరెన్నిపాట్లు పడలేదు? సగరుడు హిమవత్పర్వ తాల్లో తపస్సు చేసి, కేశిని మూలంగా ఒకణ్ణి, సుమతి మూలంగా అరువేల మందిని కన్నాడంటారే. దశరథుడు పుత్రకామేష్టి చేసి నలుగురు కొడుకులకు తండ్రైనాడని రామాయణం చెబుతూందే. ధృతరాష్ట్రుడికి నూర్గురు కొడుకులు. మహారాజంతటివాడు దిలీపుడు పుత్రార్థి అయ్యేగదా ఆవుతోకపట్టుకొని అరణ్యాల్లో తిరగాల్సి వచ్చిందని పురాణాలు చెప్పలేదా? సర్వసంగ పరిత్యాగియైన వసిష్టు డికి నూర్గురు కొడుకులు కావలసివస్తే, మనబోటి సంసార్లకు ఒక రిద్దరైనా లేకుంటే ఎలాగ?" అంటారా.


అయ్యా! మనకొచ్చిపడిన పెద్ద చిక్కే అది. భారతీయుల మైన మనకు, ముఖ్యంగా హిందువులకు మతపరంగా కొన్ని పట్టింపు లెక్కువ. ఒక హిందువులేమిటి, అన్ని మతాలవారికి కొన్ని యీలాగే నమ్మకాలుంటాయి. పుణ్యలోకాలని, పున్నామనరకాలని; 'దేహీ' అని వచ్చిన అగంతకునికింత అన్నం పెట్టడం, పిల్లలను కనడం గృహ స్థుల ధర్మమని; 'అపుత్రస్య గతిర్నాస్తి' అని, పుత్రుణ్ణి కనకపోతే

పున్నామనరకంలో తలక్రిందులుగా పడిపోవాల్సొస్తుందని — ఇంకా ఎన్నెన్నో, ఏమాత్రం నిరూపించడానికి వీల్లేనట్టి విషయాలను కథల మూలంగా అల్లి పురాణాలరూపేణా మన బుర్రల్లో ఇంకిపోయేట్లు చేశారు. అబద్ధాలకున్నంత ఆకర్షణ యదార్థాలకుండదు. ఇప్పటికీ పురాణశ్రవణానికి తీరుబడి కల్పించుకొని పల్లెల్లో జనం పోగవుతారు. హరికథలంటే చెవి కోసుకుంటారు. హరిదాసుగారి కుచేలోపాఖ్యానం విని విని, "కటికదరిద్రులైతే మాత్రం ఏం?" సంతానలక్ష్మిని కాదనగలమా? ఏమో, ఏనాటికైనా పైనుండేవాడు కటాక్షిస్తే ఏలాగో బతికిపోతారు. నారుపోసినవాడు నీరుపోయడా?" అని, తమ బ్రతుకు అంగడిబియ్యం తంగేడు కట్టెలన్నట్లున్నా, పెండ్లైంది మొదలు ఏటా తప్పకుండా ఒక పిల్లనో, పిల్లాడినో కనిపారేసి, పైనుండేవాణ్ణి నిలదీయడానికా అన్నట్లు, పదమూడవ కాన్పులో ఆ ఇల్లాలు పరమ పదిస్తుంది. అప్పటికామె వయస్సు ముప్పై రెండుంటాయి. ఇక ఆ పిల్లలగతి చూచుకోండి. ఆ తండ్రి అవస్థ చెప్పక్కర్లేదు - ఏ మాత్రమైనా పట్టించుకుంటే. లేకుంటే సరేసరి. ఎవరికివారే యమునాతీరే. వీధుల్లో చెత్తకుండీలదగ్గర వీండ్లే. సందుల్లో గొందుల్లో వీళ్ళే. హోటళ్ళబైట వచ్చేపోయేవారి చీదరింపులను కాతరు చేయకుండా చేతులు చాస్తూ వీళ్ళే. అన్నిటికి తట్టుకొని కొన్నాళ్ళకు బైటపడితే, ఒకడు దొంగతనంలో నేర్పరి కావచ్చు. ఒకడు తన యీడువారిని చేర్చుకొని రౌడీ మూక నాయకుడు కావచ్చు. మరొకడు భిక్షాటనలో నైపుణ్యం చూపవచ్చు. ఈలా పొట్టపోసుకుంటూ పేవ్‌మెంట్లమీద, పార్కుల్లో బెంచీలమీద, రైలువంతెన మెట్లమీద కాలం గడిపేస్తూంటారు. ఈ లాంటి 'కేసు' ఇదొక్కటేగాదు. ఆరాతీస్తే వందలు వేలు ఉంటాయి.


కొందరికి పెండ్లైన కొన్నేండ్లవరకు పిల్లలు కలగకపోవచ్చు. కొడుకులు లేకపోతే కొంప మునిగిపోతుందిగదూ! అందుచేత




వీధుల వెంబడి అడుక్కుంటూ




కాఫీ హోటళ్ల మెట్ల మీద



చెత్తకుండీల దగ్గర



పార్కుల్లో

పేదవారిని వరించిన సంతానలక్ష్మి దర్శనమిచ్చే చోట్లు.

ఆ దంపతులు సేవించని తీర్థముండదు. బాబాల నాశ్రయించి ఉన్న డబ్బు ఊడగొట్టుకోవడానికి అంతముండదు. ఇది కాస్తోకూస్తో ఉన్న వారిసంగతి. లేనివారైతే అశ్వత్థప్రదక్షిణాలని, పుణ్యకాలాల్లో వాయన దానాలని, సత్యనారాయణ వ్రతాలనీ, తాయెత్తులని, విభూతులని, దర్గాల దర్శనమని, మంత్రించిన నిమ్మకాయలనీ - ఓ, ఒకటా రెండా, అన్నీ చూచి చూచి, అప్పటికీ సంతానం కలగక పోతే, పూట గడవడానికి పిడికెడు నూకలు లేకపోయినాసరే, అయినవాళ్ళనెవరినైనా బ్రతిమలాడి ఎవరో ఒకరిని దత్తత చేసికొంటారు. హమ్మయ్య! ఇక పరలోకంలో వాళ్ళకు గతులు కలగడానికి ఏలాటి అభ్యంతరమూ ఉండదు. మన నమ్మకాలు అలాంటివి.

ప్రకృతి మాతనుండి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠా లెన్నో ఉన్నాయి. అందులో సంతానోత్పత్తి, సంతానోత్పత్తికి కారకులైన తల్లిదండ్రుల బాధ్యతలను గూర్చిందొకటి.

ప్రపంచంలోని సమస్తప్రాణుల జీవితాశయాలు రెండేరెండు; తిండి తినడం, పిల్లల్ని కనడం. జంతు శాస్త్రజ్ఞులు అన్ని విషయాలు తరచి తరచి, తర్కించి తేల్చిన సిద్ధాంతమిది. తక్కినవన్నీ - మతం, వేదాంతం, నీతినియమాలు, సంఘ మర్యాదలు వగైరా - కేవలం స్వార్థపరులైన కొందరి మానవులవల్ల ఏర్పడ్డవే. అవి యదార్థములు కావు. అన్నీ బూటకాలు. ఈ రెండింటిలో మొదటిది ముఖ్యం. ఏపాటు తప్పినా సాపాటు తప్పదు. 'శరీర మాద్యంఖలు ధర్మ సాధనం' అన్నారు గదూ. శరీరపోషణకు ఆహారం కావాలి; శరీరం పెరగాలి; బలం సమకూరాలి. ఆహారం లేకుంటే ఇవన్నీ జరగవు. సంతానోత్పత్తి తరువాతిది. ప్రపంచంలోకి తనమాదిరి ప్రాణుల నెన్నింటినైనా సృష్టించి వదలాలి. శాశ్వతంగా తనను పోలినవారి


తోనే ప్రపంచాన్ని నింపేయాలి. ఈ రెండు వాంఛలు స్వతస్సిద్ధంగా ప్రతి ప్రాణికి సంక్రమించినవే. చాలా బలీయమైనవి గూడాను.

జంతు శాస్త్రజ్ఞులు పరిణామ సిద్ధాంతం అనే ఒక సూత్రాన్ని నిర్మించారు. దీనిప్రకారం ఒకే కణంగల ఎమీబావంటి జీవమునుండి. క్రమక్రమంగా ఏండ్లతరబడి మార్పులుజెంది, చేపలుగా, కప్పలుగా, సరీసృపములుగా, పశులుగా మనకగపడు సమస్త జంతుకోటి, ఏర్పడ్డాయని నిరూపించారు. ఇదేవిధంగా ప్రాయశః కొన్నియుగాల క్రింద చెట్లమీద నివసిస్తూండిన ఒక మానవాకృతిగల వాలిడి వానరం నుండి మార్పుల ఫలితంగా నేటి మానవు డేర్పడినాడని జంతు శాస్త్రజ్ఞుల ఊహ.

పరిణామవృక్షం అట్టడుగున ఉన్న ఏకకణ జీవియగు ఎమీబా మొదలు అత్యున్నత స్థాయినందుకొన్న మానవునివఱకు అన్నీ ప్రాణులే. కావున అన్నిటికి ముందుజెప్పిన రెండు జీవితాశయాలూ వర్తిస్తాయి. తిండిసంగతి సరేసరి. అన్నిటికి అది అవసరమే గనుక అన్నిప్రాణులూ పరిపరివిధాలుగా తిండికి ప్రాకులాడుతాయి. ఏలాగూ ప్రతిదీ బ్రతకాలనే ఉబలాటపడుతుంది కదా. 'ఉదర నిమిత్తం బహు కృత వేషం' అన్నది మనయందెంతగా వర్తిస్తుందో అన్ని ప్రాణుల విషయంలోను అలాగే వర్తిస్తుంది. అది వేరేకథ. ప్రస్తుతానికి మనం సంతానోత్పత్తిని గూర్చి సంతానోత్పత్తికి బాధ్యులైనవాని బాధ్యతానిర్వహణలో జంతువుల ప్రవర్తనను గూర్చి పరికిస్తాం.

జంతువులు తమ సంతానం యెడ చూపు శ్రద్ధా సక్తులలో మూడుదశలను మనం గుర్తించవచ్చు. సజీవంగా సంతును పుట్టించడం (Starting of life) మొదటిది. పుట్టిన తర్వాత తగిన పోష కాహారాన్నిచ్చి పుట్టించిన ప్రాణిని పెంచడం (Nursing) రెండవది; పెరిగిన సంతానం స్వతంత్రంగా జీవించేందుకు సరియైన తర్ఫీదునివ్వ

డం (Nurture) మూడవది. కొన్ని జంతువుల్లో సంతానంమీది శ్రద్ధ మొదటిదశతో అంతమవుతుంది. పరిణామదశలో అట్టడుగున ఉన్న చేపలలో ఈ పరిస్థితిచూడచ్చు. చేపలు వేలసంఖ్యలో గుడ్లుపెడతాయి. తల్లిచేపబాధ్యత అంతతో అంతమవుతుంది. దాంతో పాటు దాని ఆరోగ్యం బాగా క్షీణిస్తుంది. గ్రుడ్లు చిదిగి పిల్లలు పెద్దవయ్యేలోగా పెద్దచేపలవాత పడిందిపోగా ఏకొద్దిపిల్లలో పెరిగి పెద్దవవుతాయి. మొసళ్ళు నీటిఒడ్డున బురదలో గ్రుడ్లుపెడతాయి. తల్లిమొసలి అప్పుడప్పుడు వచ్చి బురదను త్రవ్విచూస్తూంటుంది. గ్రుడ్డులో పిల్లచలనాన్ని వింటుంది. పిల్ల ఎదిగిందని తెలియగానే బురదను సత్వరంగా తొలగించి పిల్లపైకొచ్చేటట్లు చేస్తుంది. తర్వాత తల్లిదారి తల్లిది; పిల్లదారి పిల్లది. చేపలవలె అసంఖ్యాకముగా మొసలి గ్రుడ్లు పెట్టదు. ఇక్కడ సంతానం ప్రాణంపోసుకొని జీవయాత్ర ప్రారంభించేంతవరకే తల్లిబాధ్యత. కాని తల్లిబాధ్యత కొంతపెరిగింది. సంతానం సంఖ్య తరిగింది. మొసలికంటె పరిణామదశలో కాస్తపైమెట్టులోనున్న పక్షులవిషయం చూద్దాం. గ్రుడ్లకొచ్చే ముందు జతగూడేటప్పుడు గూళ్ళుకడతాయి. ఒకటి రెండుగ్రుడ్లు మాత్రం పెడతాయి. జాగ్రత్తగా గ్రుడ్లమీదకూర్చొని పొదిగి గ్రుడ్లు చిదిగి పిల్లలు వెలికి వచ్చినతర్వాత ఆహారాన్ని తెచ్చి పిల్లలకందిచ్చి వాటికి రెక్కలొచ్చేవరకు కాపాడతాయి. తర్వాత అవి గూడువదలిపోతాయి. తల్లి పక్షిబాధ్యత మరోమెట్టుపైకిపోయింది. పిల్లలుఆహారాన్ని స్వయంగా సంపాదించుకొనేంతవఱకు వాటిపోషణ భారాన్ని తల్లి స్వీకరించింది. పెంపుడు కోళ్ళలో సహితం సంతానం ఎడల తల్లిబాధ్యత మరింత స్పష్టంగా మరోమెట్టు పైకివెళ్ళడం కనబడుతుంది. గ్రుడ్లనుండి పైకివచ్చినవెంటనే ఎరను సంపాదించుటకేమిచేయాలో, చెదపురుగులెక్కడుంటాయో, చెదమట్టిని ఏలా చెలగాలో, చెదపురుగులను ముక్కుతో ఏలా యేరుకోవాలో అనీ


3
సంతు మితం
తల్లి బాధ్యతలు
అపరిమితం
2 సంతు పరిమితం తల్లి బాధ్యతలూ పరిమితం
1 సంతు అనంతం
తల్లికి ప్రాణాంతకం

పిల్లలకు తల్లికోడి చేసిచూపి, నేర్పుతుంది. పిల్లలు బైటతిరుగు నప్పుడు కాకి, గ్రద్దలాంటి శత్రువులజాడ తెలిసినవెంటనే అపాయ సూచకంగా కేరుతుంది (అరుస్తుంది). పిల్లలు ఎంతదూరంలో ఉన్నా తక్షణం గంతులేసుకుంటూ పరుగెత్తుకొచ్చి తల్లిరెక్కలక్రింద నక్కు తాయి. అవసరమొస్తే కాకితోగాని, గద్దతోగాని పోట్లాడడానికి గూడా తల్లి కోడి వెనుదీయదు. పిల్లలు పెద్దవై తమకు తాము జీవయాత్రగడపడానికి సమర్థవంతమయ్యేవఱకు తల్లికోడి పుంజుకు లొంగదు. ఇక్కడ పిల్లలయెడ తల్లిబాధ్యత మరొకమెట్టు పైకి పెరగడం గమనించవచ్చు. ఇలాగే పిల్లి, పులి, ఏనుగు వగైరా జంతువులలో తల్లిబాధ్యత మూడుదశలకూ పెరగడం సంతానసంఖ్య తరగడం గమనార్హం. జంతుపరిణామవృక్షంలో అగ్రస్థానాన్ని ఆక్రమించిన మానవుని బాధ్యత ఏస్థాయికిచేరాలో మనం సులభంగా ఊహించవచ్చు. ప్రకృతికి విరుద్ధంగా మానవుడిప్పుడు చేస్తుండే పనేమిటి? బాధ్యతారహితంగా ఎంతమంది పిల్లలనైనా కని పడెయ్యటమేనా?

గృహస్థుగా వైవాహిక జీవితాన్ని సాగించడం, సంతానాన్ని పొందడం, వ్యక్తిగతంగా అందరికి ప్రకృతి సంక్రమింప జేసిన హక్కు. ఎవరూ కాదనలేరు. కావున వివాహాలు చేసుకోవద్దని ఎవరూ అనరు; పిల్లలను కనవద్దనీ అనరు. శైశవం, బాల్యం, కౌమార్యాది దశల్లో గృహస్థాశ్రమం గూడా మానవుని విధ్యుక్త ధర్మం. సంతానం బడసి వార్థక్యం సమీపించినప్పుడు వానప్రస్థం స్వీకరించాలి. ఇల్లు వాకిలి వదలి సంసారలంపటలేకుండా ప్రశాంత మైన ప్రదేశంలో ఆశ్రమం నిర్మించుకొని, భార్యకూడా బ్రతికుంటే ఆమెతో కలిసి బ్రహ్మచర్యం పాటిస్తూ శేషించిన జీవితం గడపాలి. అవసరమని తోచినప్పుడు, ఆచరించగలమని ధైర్యమున్నప్పుడు సన్యసించవచ్చు. అంతేకాని, ఆస్థికి వారసులు కావాలని, ముసల్దాని

ముచ్చట తీర్చాలని, "మొదటి పెండ్లానికందరూ ఆడపిల్లలే పుట్టారే, ఒకమగబిడ్డడుంటే ఎంతబాగుణ్ను" అని ఆడపిల్లల తండ్రి, "అందరూ మగపిల్లలే అయ్యారే ఆడపిల్లముచ్చటెప్పుడు తీరుతుం" దని మగపిల్లలతండ్రి ఈలా ఏదో వంకతో అరవయ్యోపడిలోనైనా సరే పెండ్లిమీద పెండ్లి చేసుకొని పిల్లలను కంటూ ఉండమని ఎవ్వరూ శాసించలేదు.

సనాతనంగా మనలో ఐక్యకుటుంబాల పద్ధతి ఒక విశిష్ఠ సాంప్రదాయం. ఒక కుటుంబంలో అన్నదమ్ములెందరున్నా, తండ్రి అనంతరం కుటుంబ నిర్వహణ బాధ్యతంతా పెద్దకుమారుడే స్వీకరించాలి. అందుకే గురువులుగా చెప్పబడ్డ అయిదుమందిలో జ్యేష్ట భ్రాతనుగూడా చేర్చారు. అయిదు గురువులెవరంటారా? ఈ తనువుకు కారణమైన తల్లి, తండ్రి, చదువుచెప్పిన గురువు, తండ్రి తర్వాత అన్ని బాధ్యతలు స్వీకరించాల్సిన పెద్దఅన్న (జ్యేష్టభ్రాత), భార్య అయినదానికి భర్త. ఈ అయిదుమంది గురువులుగా పూజింపదగినవారన్నారు. ఆస్తికంతా తండ్రి తర్వాత పెద్దకొడుకే హక్కుదారుడు. తక్కినవాండ్లందరు ఇతని చెప్పుచేతలలో మెలగాల్సినవాండ్లే. ఇప్పటి మోస్తరుగా అన్నదమ్ములు విడిపోవడాలు, వేరు కాపురాలు పెట్టడాలు, భూములు, ఇల్లువాకిలి, కుండసట్లువరకు ఒక్కటి మినహాయించకుండా చరస్థిర ఆస్తులన్నిటిని పంచుకోవడాలు మనకనేక కారణాలవల్ల కాలక్రమేణా సంక్రమించినవే. ఈలా భూమి పుత్ర పుట్టిన సంతానం పంచేసుకుంటూంటే కొన్ని తరాల అనంతరం ఒక్కొక్కడికి వచ్చే భూ విస్తీర్ణం ఎంతుంటుంది? వాటాదారుని రుద్ర భూమికి గూడా సరిపోకపోవచ్చు. ఇక వ్యవసాయమేలా సాగుతుంది? పంటలేలా పండుతాయి? మన తిండిగింజల సమస్య ఏలా తీరుతుంది? భారీ యెత్తున ట్రాక్టర్లు వగైరాలనుపయోగించి వ్యవసాయం సాగించడం కష్టం. జపాన్‌లో రైతులమోస్తరు,

కొండచరియలలోగల చిన్న చిన్న పొలాలలో ప్రాచీన పద్ధతులలోనే వ్యవసాయం సాగించాలి.

కుటుంబాలలోనేకాక రాజ్యాధినేతలు సహితం ఈ సూత్రాన్నే పాటిస్తూ వచ్చారు. 'లా ఆఫ్ ప్రైమోజనీచర్' (Law of Primogeniture) అంటే ఆస్థిహక్కంతా పెద్దకొడుక్కే దఖలు పడాలన్న సూత్రాన్ని ఐరోపాలోని రాజ్యాలలో పాటించేవారు. నలుగురు కొడుకులున్నా, దశరథుని అనంతరం పెద్దకొడుకైన రాముడికే పట్టాభిషేకం చేయసంకల్పించాడు. రాముడు వనవాసంలోనున్నప్పుడు భరతుడు రాజ ప్రతినిధిగా రాచకార్యాలు చూచుకొనేవాడు. అంతేకాని, వనవాసానంతరం రాజ్యాన్ని నాలుగు ముక్కలు చేసి నలుగురన్నదమ్ములు పంచుకోలేదు. ధృతరాష్ట్రుని అనంతరం దుర్యోధనుడొక్కడే రాజయ్యేవాడు, యుద్ధంలో చావకుండా ఉండిఉంటే. ధృతరాష్ట్రుడున్నప్పుడు కూడా రాచకార్యాలన్నిటిలో దుర్యోధనుడే నిర్ణయాలు తీసుకొనేవాడు. భారత యుద్ధానంతరం ధర్మజునికే పట్టంగట్టారు. తక్కిన అన్నదమ్ములందరూ ఆయనకంగరక్షకులైనారు. ఇవన్నీ కథలే. కాని ఆ కాలంలో ఆచరణలోఉన్న ధర్మసూత్రం మనకిందుమూలంగా తెలుస్తూంది. పెద్దవాడొక్కడే రాజ్యానికి వస్తాడు. తక్కినవారంతా రాజప్రతినిధులుగా, రాజ్యం పెద్దదిగా ఉంటే వివిధ, ప్రాంతాలలో చెలామణీ అవుతారు. గాని రాజులు మాత్రం కాలేరు. ఇందువల్ల రాజ్యం విచ్ఛిన్నమై బలహీనమైపోదు. రాజసైన్యం, ధనాగారం, న్యాయస్థానం వగైరా సప్తరాజ్యాంగాలు చీలికలైతే రాజ్యమే అల్లకల్లోలమైపోతుంది. అలా కాకూడదనే పెద్దకొడుకొక్కడికే పెత్తనమంతా చెందాలనీ మిగతావాండ్లకందులో భాగంలేదనీ అన్నారు. ఒక తండ్రికి కలిగిన పిల్లలలో మొదటివాడు ధర్మనిర్వ


హణ కోసం పుట్టాడని తక్కిన సంతానం తల్లిదండ్రుల కామానికే జనించారని అనేవారు. ధర్మాన్ని కాపాడడానికి ఒక్కకొడుకే చాలునని ఇందులోని అంతరార్థం.

కాని ఇప్పుడు పరిస్థితులు మారాయి. అధికస్య అధికంఫలం అని సంతానమెంత ఎక్కువైతే అంతమంచిదనే అనుకొన్నారో, దేశానికి మనుష్యుల సంఖ్యే బలాన్నిస్తుందనుకొన్నారో, 'విశాల మైన దేశముంది, పుష్కలంగా తిండిఉంది. మనకేం తక్కువ' అను కొన్నారో, కారణమేదైనాగాని, జనసంఖ్య మాత్రం మితంలేకుండా పెరిగిపోతూంది. ఇప్పటికైనా మనం మేలుకోకపోతే ముందున్నది మొసళ్ళ పండగ.


ప్రాణులు - పరిసరాలు పరస్పరాధారంగలవి. భూమికి ప్రాణు లను భరించేశక్తి పరిమితంగానే ఉంటుంది. ఒక ఎకరం భూమికి పది పశువులను భరించేశక్తి ఉందనుకొందాం. ఆ చోట పది పశువులను మాత్రం వదలితే వాటికి తిండికి నీటికి ఏ ఇబ్బందీ ఉండదు. పచ్చిక, నీరు సమృద్ధిగా ఉంటుంది. మొక్కలు గూడా పెరుగుటకవకాశముంటుంది. అదే భూమిలో వంద పశువులను వదలితే ఏమవుతుంది? తొక్కిసలాటలో భూమి నలిగి నాశనమవుతుంది. పచ్చిక వృద్ధికాదు, నీరు అన్నిటికీ అందకపోవచ్చు. మొక్కలు పెరగడానికి స్థలమేది? ఎకరం భూమి వంద ప్రాణులను భరించే శక్తిలేక క్షీణిస్తుంది. తిండికి కరువు, నీటికి కటకట, స్థలానికి ఎద్దడి, క్షామం. సర్వనాశనం. పశువులకు పశువులు భూమికి భూమీ చస్తాయి.

అలాగే ప్రపంచానికిగూడా జనాన్ని భరించే శక్తికి కొంత పరిమితి ఉంది. ఈ పరిమితినెప్పుడో దాటిపోయామని కొందరు నిపుణుల అభిప్రాయం, నిజమే కావచ్చు. అమెరికా జనాభా ప్రపంచ

ప్రాణికోటిని భరించడానికి భూమికొక పరిమితంటూ ఉంది



ఆ పరిమితి మించనంతకాలం అంతా క్షేమమే



అది మించితే అంతా క్షామమే

జనాభాలో ఆరుశాతముంటుంది. ప్రపంచంలో లభించు సమస్త వస్తుసంచయంలో నలభై శాతం అమెరికాప్రజలు వాడుకొంటున్నారు. తక్కిన వారందరు వారి జీవితపరిమాణ్ణందుకోవాలంటే, వారు 1969లో వాడుకొన్న నీరు, ఆహారధాన్యాలు, ఇనుము, రాగి, కలప తైలము, మున్నగు సమస్త వస్తుసముచ్ఛయానికి ఇరవైరెట్లు కావలి సొస్తుంది; ఇంత పెద్దఎత్తున మనకవసరమైన వస్తువులు మనం నివసించే ఈ చిన్న గ్రహంలో నిక్షేపించబడలేదు. పెరిగే జనాభాకు కావలసిన సామగ్రి ఎక్కడనుండి తేవాలి?


'మీ సైన్సుశాస్త్రం ఏమైందంటారా? ఒక ప్రదేశాన్నుండి మరో ప్రదేశానికి మునుపు మనుజులు వలసపోయినట్లు ఇకముందు ఇతర గ్రహాలకు కూడా వలసపోవచ్చునేమో! అలా పోవడానికి అంగారక గ్రహాన్నిపుడిక్కడినుండే పరిశీలిస్తున్నారుగదూ? అంతగా ప్రాణంమీదికొస్తే మూటముల్లే సర్దుకొని ఇతర గోళాలమీదికి దాటేస్తేసరి'.

సైన్సు శాస్త్రం ఏమైందన్నారు గదూ? శాస్త్రజ్ఞులు చేయాల్సిందంతా చేస్తూనేఉన్నారు. ఎకరాకొక బస్తాధాన్యం పండే భూములనుండి నాలుగైదింతలు దిగుబడి వచ్చేటట్లు కృషి చేస్తున్నారు. ఒక బస్తాధాన్యం నెలకు వందమందికి సరిపోయేది నాలుగు బస్తాలు పండితే నాలుగు వందలమందికైతే సరిపోగలదు గాని ఎనిమిది వందల మందికేలా సరిపోతుంది? పైగా ఏ సైన్సు శాస్త్రజ్ఞుడైనా స్వతంత్రంగా శూన్యంనుండి పిడికెడు మట్టిని సృష్టించలేడు. క్రొత్తగా గ్లాసెడు నీటిని తయారు జేయలేడు. ఒక కేజీ బొగ్గునుగాని ఒక లీటరు పెట్రోలునుగాని సృష్టించడం అసాధ్యం. కొందరు బాబాలైతే చేతులనుండి బూడిదని రాలుస్తారు. రుద్రాక్షలను పుట్టిస్తారు. ఇంకా కొన్ని చిన్న చిన్న వస్తువులను,

చేతిలో ఇమడగలిగిన వాటిని హస్తలాఘవం చూపి మన కన్నుగప్ప గలరు గాని, మనకు పనికివచ్చేదేదీ పెద్ద యెత్తున సృష్టించి ఇవ్వ లేరు. మీకు ఓపికుంటే, ఓపికకంటే ధైర్యముంటే, ఈ సారెవరైనా బాబాను దర్శించినప్పుడు గంపెడు మట్టిని, బిందెడు నీళ్ళను సృష్టించమని అడగండి. అలా చేయగలిగితే ఆయనకు బంగారపు తొడుగు తొడగచ్చు; బ్రహ్మరథం పట్టచ్చు. లోకంలో వజ్ర వైడూర్యాల కంటె, రత్న రాసులకంటె, రజిత హేమాలకంటె విలువైంది - మట్టి, నీరు. ఏ సైన్సు గూడా శూన్యంనుండి ఈ వస్తువులను సృష్టించలేదు.

ఇక ఖగోళయాత్రలు చేయగలుగుతామంటారా? అదీ దుస్సాధ్యమన్న సంగతి ఇటీవలే తెలిసిపోయింది. చంద్రమండలానికి అమెరికన్లు, రష్యన్లు పోయివచ్చిన సంగతి మీకు గుర్తుండే ఉంటుంది. అక్కడికి పోయివచ్చినవారు చెప్పింది వింటే మనం నివసించే ఈ చిన్న గ్రహం (భూమి) ఎంత విలువైందో తెలుస్తుంది

కర్నల్ ఫ్రాంక్ బోర్మన్ (Col. Frank Borman) అతని సహచరులిద్దరు అపోలో 8లో చంద్రమండలానికి జరిపిన సాహస యాత్రను గూర్చి 1969లో తమ అనుభవాల్ని వివరిస్తూ భూమినీ రోదసినీ వర్ణించారు. మన భూమి నావరించుకొనియున్న వాయు ప్రదేశాన్ని దాటి పైకివెళ్ళితే 'ఆకాశం గగనం శూన్యం' అన్నారే అది అక్షరాలా నిజమని తెలుస్తుంది. చుట్టూ ఆవరించియున్నది కన్ను కానని చిమ్మచీకటి. ఏలాంటి చైతన్యమూ లేనిది. ఏ ప్రాణీ బ్రదకడానికి అనువుకానిది. అది ఒక విధమైన అంతంలేని ఎడారి వంటిది. మనిషైనవాడక్కడ కాలుమోపగలిగాడంటే ఉత్తరక్షణం వాడికాలం తీరిందన్నమాటే! రోదసిలో తిరుగుచున్న మన చిన్న భూగోళం ప్రాణాంతకమైన ఎడారినడుమ, చక్కని నీడనిచ్చి




హాయిగొలిపే చెట్లతో, చల్లని నీటి నిచ్చి సేదదీర్చే బుగ్గతో, కన్నుల విందు గొలిపే పచ్చని పచ్చికబయలుతో గూడిన జలాశయం (ఓయాసిస్ - Oasis) వలె ఉందని బోర్మన్ వర్ణించాడు. వివిధ నిధి నిక్షేపాలతో మానవునికి సమస్త సౌఖ్యములను చేకూర్చు భూమికి మనమెంతో ఋణపడియున్నాము. స్వయంగా రోదసి అంతా తిరిగి చంద్రమండలంమీద కాలుమోపి వచ్చిన బోర్మన్ చెప్పిన ప్రత్యక్షసాక్ష్యంతో మనకు యదార్థం తెలిసింది. ఖగోళాలకు వలస పోగలమన్న ఆశగూడా అడియాస అయింది.

'ఇట్టి గోళమువంటివి కెన్ని అర్బుదంబులున్నవో!' అని కవి ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడే, అదంతా హుళక్కి. బూటకం. ఈలాంటి భూలోకం మరొక్కటి ఇంతవఱకు ఎక్కడా కనిపించలేదు. వేరే

లోకాలంటూ ఏవీలేవు; స్వర్గం లేదు; నరకం లేదు; ఊర్థ్వలోకాలు లేవు; అథోలోకాలూ లేవు. పున్నామనరకం లేదు; పుణ్యలోకాలూ లేవు; రసాతలంలేదు; గిసాతలంలేదు. పసందైన కథలమూలంగా, యదార్థంకానట్టి కొన్ని విషయాలను సృష్టించి తెలివిగల కొందరు స్వార్థపరులు మనకు నూరిపోసినట్టివే యివన్నీ. ఈ వలలో తగు ల్కొని గిలగిలా తన్నుకొంటూ ఇవతలికి రాలేకపోతున్నాం.

మానవ వాసయోగ్యమైన వేరే గోళాలేవీ లేవని తేలి పోయిందా? రోదసిలో గిరగిర తిరుగుతూ సూర్యుని చుట్టూ ప్రద క్షిణం చేస్తూ, మానవుని ప్రాణాల్ని కాపాడుతూన్నది ఈ భూమి ఒక్కటే. ఇదెంత అమూల్యమైందో మనకిప్పుడు తెలిసొచ్చింది. ఈ భూమి తప్పితే మనకు గత్యంతరం లేదు. ఇందులోని సమస్త నిధి నిక్షేపాలను మనమెంత జాగ్రత్తగా వాడుకుంటే అంత మంచిది. పరిమితికి మించి ఏం జరిగినా అపాయం తథ్యం.

మన పంచవర్ష ప్రణాళికా కాలంలో కోట్లకొలది డబ్బు ఖర్చు పెట్టాం. రాజ్యాంగం అమలులోకివచ్చిన పదేండ్లలోగా నిరక్షరాస్యత నిర్మూలిస్తామన్నాం. నిరుద్యోగమంటూ ఉండదని నమ్మబలికాం. కూటికి గుడ్డకు కొదవ ఉండదని కలలుగన్నాం. ఏదీ? ఒకటిగాదు రెండుగాదు అయిదు పంచవర్ష ప్రణాళికలు పూర్తిఅయ్యాయి. కలలు కలలుగానే ఉండిపోయాయి. ప్రణాళికా ప్రగతి - జనాభా పెరుగుదల తాబేలు - కుందేలు పరుగుపందెంలా తయారైంది. అయితే ఈ కథలో కుందేలు, పరుగు బాటమధ్యలో యెక్కడా నిద్రపోలేదు. ఒకటే పరుగు, పరుగు. తిరిగి చూడకుండా పోతూంది. ఎంత ప్రయత్నించినా తాబేలు దాన్నందుకోలేకపోతూంది. ఏ మహానుభావుడైనా కుందేటిని ఆపితే తప్ప, తాబేలు దాన్ని చేరుకోలేదు.




మనరాష్ట్రంలోనే ఎక్కడో ఒకచోట నరసింగాపురం అనే గ్రామముందనుకొందాం. 1971 లో దాని జనాభా అయిదువేలను కొందాం. జనాభా లెక్కలనుబట్టి 6 నుండి 11 సంవత్సరాల యీడు గల పిల్లలు అక్కడ వెయ్యిమంది ఉండాలి. ఈ వెయ్యిమంది పిల్లలకు సరిపడా అయిదు ప్రాథమిక పాఠశాలలు గ్రామంలో అక్కడక్కడా పెట్టారనే అనుకొందాం. ఒక్కొక్క పాఠశాలకు అయిదుగురు చొప్పున ఉపాధ్యాయులను గూడా ఏర్పాటుచేశారనే అనుకొందాం. ఇప్పటి జననాల పెరుగుదల తీరునుబట్టి 1975 కంతా 1150 మంది బడియీడు పిల్లలవుతారు. అంటే అదనంగా తయారైన నూటయాభై మందికి అయిదుమంది ఉపాధ్యాయులను అధికంగా నియమించాలి. వాండ్లకు కావలసిన బల్లలు, కుర్చీలు, బోధనోపకరణాలు, బడిస్థలాలు అదనంగా సమకూర్చాలి. ఈ విధమైన గ్రామాలు, ఇంతకంటె చిన్నవి, పెద్దవి అన్నీకలిపి మన రాష్ట్రంలోనే ఇరవై యేడువేలున్నాయి. ఇవిగాక పట్టణప్రాంతాలు లక్ష జనసంఖ్యకు లోపుగానున్నవి రెండువందలయేడు. లక్షకుపైగా జనసంఖ్యగలవి పదమూడున్నాయి.

ప్రతి అయిదేండ్లకు రాష్ట్రమంతటా ఈలా పెరిగిపోతూన్న బడి పిల్లల సంఖ్యకు తగినంతమంది ఉపాధ్యాయులను, పాఠశాలా సామగ్రిని సమకూర్చాలంటే ఎంతకష్టతరమైన పనో ఆలోచించండి. రాష్ట్రప్రభుత్వాని కొక్క పాఠశాలలేకాదు. ఇతరత్రా ముఖ్యమైన ప్రజావసర కార్యాలు చేపట్టవలసినవెన్నో ఉన్నాయి. మంచినీటివసతి, పంటకాల్వల త్రవ్వకం, ఆనకట్టల నిర్మాణం, విద్యుచ్ఛక్తి సరఫరా, ప్రజారోగ్యసంబంధమైన ఆస్పత్రులని, మందులని, వైద్యులని, వ్యాధి నిరోధక చర్యలనీ, వ్యాధినిర్మూలన కార్యక్రమాలనీ – అనేక మున్నాయి. వీటి అవసరాలుకూడా ఏడాదికేడాదే పెరుగుతూన్న జనాభా ననుసరించి అధికమవుతూనే ఉంటాయి. పైగా బడియీడు పిల్లలు కలకాలం 6 నుండి 11 ఏండ్ల లోపుగానే ఉండరు. వారు పెరిగి పెద్దవారవుతారు. కొందరు పైచదువులకు వెళ్ళతారు. చదువులైన తర్వాత అందరికి తగినన్ని ఉద్యోగాలుండవు. నిరుద్యోగ పిశాచం ఎదురవుతుంది.

ఒక మనరాష్ట్రం సంగతే యీలా ఉంటే దేశంమొత్తంమీద ఎలాఉంటుందో చూడండి. మనదేశ జనాభా 1971 సంవత్సరపు లెక్కల ప్రకారం 54,47,94,980. అయిదేండ్లకు ఒకసారి పెరిగే జననాలతీరు ననుసరించి దేశంమొత్తంమీద ప్రతి పంచవర్ష ప్రణాళి కాంతానికి రమారమి పదికోట్ల ప్రజ అదనంగా చేరుతూంటుంది.

'దేశమంటే మట్టికాదోయి దేశమంటే మనుషులోయి' అని గురజాడ వారన్నారే గుర్తుందిగదూ. ఆలాగ ఇది కేవలం ఒకసంఖ్య గాదు. ప్రాణంతోఉన్న మనుషులు. మనలాగే వాళ్ళూ ఇళ్ళు కట్టుకోవాలి. పెళ్ళిళ్ళు చేసుకోవాలి, పిల్లల్ని కనాలి. మనలాగే వాళ్ళూ స్కూళ్ళకు, కాలేజీలకు, యూనివర్సిటీలకు పిల్లల్ని పంపాలి. పార్కులకు, సముద్రతీరాలకు, సినిమాలకు, డ్రామాలకు పోవాలని వాళ్ళూ

సరదాపడుతూంటారు. వాళ్ళూ వ్యాధిగ్రస్థులు కావచ్చు, వైద్య సహాయంతో పనిపడచ్చు. హాస్పిటళ్ళు, డాక్టర్లు, మందు మాకు వాళ్ళకూ అవసరమవుతుంది. ప్రతీ అయిదేండ్లకు ఎంతో బ్రహ్మాండమైన మొత్తున అన్నిసదుపాయాలూ సమకూర్చడం నోటిమాటలా? ఎంతటి ప్రభుత్వమైనా, ఎన్నికోట్లు ఖర్చుపెట్టినా ఈ సమస్య తీరదు. దీనికి పరిష్కారమార్గ మొక్కటే. కళ్ళెం తెంపుకొని పరుగులు తీస్తున్న పందెపుగుర్రంలాంటి జననాల సంఖ్యను ఆపడమే. ఎవరాపగలుగుతారంటారా? మనమే. ఇంకెవరు? పెండ్లయినప్రతిజంట పూనుకోవాలి. ప్రభుత్వాలేమీ చేయలేవు; ప్రజలే చేయాలి. దేశ క్షేమం కోసం; స్వంత లాభంకోసం కూడా.

వెనకటికోరాజు. రాజధానినగరం మధ్య ఒక అమావాస్య నాటి రాత్రి పెద్ద బంగారు గుండిగనొకదానిని పెట్టి, ఊళ్ళో ప్రతి కుటుంబం ఒక్కొక్క శేరు పాలు అందులో పోయాలని చాటించాడట. 'అందరూ పాలుపోస్తారుగదా మనమొక్కరే నీళ్ళు పోస్తే ఆ చీకటిలో ఎవరు చూడొచ్చారు?' అని ఏ కుటుంబానికాకుటుంబమే ఒకరికి తెలియకుండా ఒకరు అనుకొన్నారుట. తెల్లవారేసరికి గుండిగనిండా నీళ్ళే! తరువాత రాజుగారేంజేశారో మనకెందుకుగాని, "కోటానుకోట్ల జనసంఖ్యలో మన ఒక్క కుటుంబం పెద్దదైతే ఏమైంద"ని ఏ కుటుంబానికాకుటుంబం అనుకుంటే మనసమస్య ఏలా పరిష్కారమవుతుంది? కాబట్టి ఈ సమస్య మన ప్రతిఒక్కరిదీను. ప్రతి అయిదేండ్లకూ ప్రతిగ్రామంలో పిల్లల జననాలు సగానికిసగం తగ్గేట్లు చూడాలి. పెద్ద కుటుంబాలన్నీ చిన్న కుటుంబాలుగా మారాలి. ఇదేలా చేయగలుగుతాం? అని సందేహించవక్కర్లేదు. అనుకోవాలేగాని సాధించడం చాలా సులభమే.

ప్రథమంగా తమ వయస్సు ఇరవై దాటేవరకు ఆడపిల్లలెవరూ పెండ్లికి ఒప్పుకోకూడదు. అలాగే మగవారు సహితం తమ

వయసు ఇరవై మూడు దాటితేగాని వివాహానికి సిద్ధపడగూడదు. ముందంతా పిల్లకు పదేండ్లు నిండకముందే (రజస్వల కాక పూర్వం) పెండ్లిండ్లు చేసేసేవారు. పిల్ల ఎదిగిన వెంటనే కాపరానికి పంపడం, ఇక అప్పటినుండి ఏటా కాన్పులు, గండాలన్నీ గడిచి గట్టున పడితే ముప్పయి సంవత్సరాలైనా తిరక్కమునుపే ముసలమ్మలా తయారవడం - ఇది అప్పటి వరస. ఇప్పుడాలా చేయడానికి వీల్లేదు గదా.

యుక్తవయసొచ్చిన తర్వాతే పెండ్లి చేసుకొన్నారనుకొందాం. పెండ్లయి కాపురానికొచ్చిన తర్వాత, గర్భం నిలిచిన వెంటనే మీ గ్రామ సమీపంలోనుండే ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని వైద్యుల సలహా తీసికోండి. ఇదెంతో అవసరం. మీ ఆరోగ్యం దెబ్బతినకుండా సరియైన మందులు వారు అందజేస్తారు. ఆహార విషయమై వారి సలహా పొంది పాటించండి. వైద్యులు చెప్పిన గడువులలో తప్పనిసరిగా వారిని చూచి పరీక్ష చేయించుకోండి. ప్రసవసమయంలో తర్ఫీదు పొందిన మంత్రసాని సాయం తీసుకోండి. అవసరమైతే వైద్యుని సాయంపొందండి. ప్రసవించిన అనంతరం, పుట్టిన బిడ్డనుగూర్చి ఆరోగ్యాన్నిగూర్చి గూడా తగుజాగ్రత్తలు తీసుకోవడం అవసరం. వైద్యుల సలహాలు, సరియైన ఆహారం, ఔషధాలు వగైరాలు మీ ఆరోగ్యాన్ని కాపాడుతాయి. ఈ విధంగా ప్రసవానికి ముందు, ప్రసవమప్పుడు, ప్రసవానంతరం తగుజాగ్రత్తలు తీసుకొంటే పిల్లలు గర్భంలోనే చచ్చిపుట్టడం, శిశు మరణాలు, మున్నగునవి ఉండవు. పైగా తల్లి ఆరోగ్యం చెడదు. ఈలా ఒకరిద్దర్ని కన్న తర్వాత పిల్లల్ని కనడం మానేస్తే శ్రేయస్కరం.

మా అమ్మకు అమ్మమ్మ నలభై యేండ్ల వయస్సప్పటికే ఇరవై మందిని కని పడేసింది. అందులో పదిమంది పోతే పదిమందిమిగిలాం. ఒకరిద్దరితో ఆపేస్తే మునుముందు వీరికేమవుతుందో మనం చెప్ప


V.R. NARLA MEMORIAL LIBRARY
Acc. No. 1116/

గలమా? మాకంటె ముందే వాళ్ళు ఏ కారణంచేతనైనా 'హరీ' మంటే ముసలితనంలో మాకు గుక్కెడు నీళ్ళుపోసేదిక్కేది?"


ఆదా మీ సందేహం. మీ అమ్మకు అమ్మమ్మకన్న పిల్లలలో పదిమంది యెందుకుచావాలి? రోగాలొచ్చి, ఆ కాలం వేరు. అప్పుడిప్పటివలె వైద్య సదుపాయాలు లేవు. పెద్దమ్మవారు వంటి అంటు వ్యాధులతో పిల్లలు పెద్దలు చాలామంది కడతేరేవారు. కలరావస్తే ఊరికి ఊరే ఊడ్చిపెట్టుకపోయేది. చలిజ్వరం, టైఫాయిడు, రక్త విరోచనాలు మున్నగు వ్యాధులకప్పట్లో సరియైన మందులెక్కడివి? అందువల్ల అప్పుడు మరణాలు ఎక్కువే? ఇప్పుడు పుట్టేవారంత సులభంగా మరణాల పాలుగారు. పుట్టింది మొదలు శిశు సంక్షేమం తాలూకు సమస్త చర్యలు టీకాలు వేయడం (స్ఫోటకం రాకుండా), ట్రిపుల్ వాక్సినివ్వడం, పోలియో డ్రాప్స్, బి.సి.జి. టీకాలనీ, అనేక వ్యాధి నిరోధక చర్యలేగాక, ఏదైనా వ్యాధి సంభవించినా, అద్భుతమైన ఆధునిక నివారణోపాయాలున్నాయి. ఇప్పుడుగూడా ఏ సమయానికేలా ఉంటుందోనని, ఎందుకైనా మంచిదని ఎంతమందినైనా శక్తి ఉండేలోగా కనిపడేయాలని, దొడ్డికాళ్ళు, ఊదరబొజ్జ, గువ్వరొమ్ము, గూను, చచ్చుచేతులు - కాళ్ళు, పాలిపోయిన ముఖం, ఎప్పుడూ ముక్కుల్లో కార్చుకుంటూ గుడ్డా గోచీలేకుండా మట్టిలో పొర్లాడుతూ చీటికిమాటికి రోగాలతో బాధపడుతూ, మిమ్మల్ని బాధిస్తూ జీవితాన్నే దుఃఖభాజనం చేయగల, పరిణామవృక్షంలో ఆట్టడుగున ఉన్న చేపలవలె బాధ్యతా రహితమైన కుచేల సంతానాన్ని కోరుకొని మీ ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటారో లేక అందుబాటులోనున్న అన్ని అవకాశాలూ ఉపయోగపరచుకొని ఆరోగ్యవంతమైన ముద్దులు మూటగట్టు ఒకరిద్దరి పిల్లలతో సరిపుచ్చుకొని, మీ సంసారాన్ని సుఖమయం చేసుకొని, పరిణామవృక్షంలో పై మెట్టందుకొన్న బాధ్యతాయుతుడైన

మానవునివలె పరిమిత సంతానంతో సంతోషంగా ఆరోగ్యవంతమైన జీవితం గడపాలనుకొన్నారో మీరే నిర్ణయించుకోండి.


పిల్లల సంఖ్య యెక్కువైతే ఎన్నో సాధక బాధకాలున్నాయి. ఏదో యింత ఉన్నవారికి గూడా ఈ కాలంలో కుటుంబం పెద్దదైతే




తలిశెట్టి రామారావుగారికి కృతజ్ఞులతో.



షాజహాన్ చక్రవర్తికి కలిగిన అధిక సంతాన ఫలితం
నడివయస్సులో భార్యా వియోగం
ముసలితనంలో తీరని మనోవ్యథ



భరించడం కష్టమే. అన్నిటికంటె ముందు సంతానమెక్కువయ్యే కొద్దీ ఆలుమగల మధ్య అన్యోన్యానురాగం అంతమవుతుంది. అంతే కాక తల్లి ఆరోగ్యమెంతగానో క్షీణించిపోతుంది. పెరగడానికి పిండంగా గర్భంలో నున్నప్పుడు రక్తంద్వారా, శిశువు పుట్టిన తర్వాత స్తన్యంద్వారా, తల్లి శరీరంనుండి అవసరమైన అన్ని పదార్థాలను పసికందు పీల్చేస్తుంది. సంవత్సరం తప్పకుండా పిల్లల్ని కంటూంటే ఆ తల్లి ఆరోగ్యం నానాటికి తీసికట్లు నాగంభట్లు. ఎంత పోషకాహారం తింటున్నా సరే, చిల్లిపాత్రలో నీరుపోసినట్లే. అంతకంతకు శరీరానికి సహజంగాఉన్న వ్యాధినిరోధక శక్తి క్షీణిస్తుంది. అలాంటప్పుడు ఏ వ్యాధిక్రిములైనా శరీరంలో ప్రవేశించెనా అంతే. అవి అనతికాలంలో వృద్ధియై ఆ తల్లి అకాలమరణం పాలవుతుంది. అర్జుమాన్డ్ బానోబీగం అందాలరాశి. అతిలోక లావణ్యవతి. ఆమె అందానికి ముగ్ధుడైన షాజహాన్ తన ఇరవైయవయేట ఆమెను వివాహమాడాడు. 1612లో పెండ్లయింది. 1613 నుండి పిల్లల్ని కనడం ప్రారంభించింది. 1631లోగా పద్నాలుగు మందిని కనింది. పద్నాలుగో కాన్పులో కన్నుమూసింది. అప్పుడామె వయస్సు ముప్పైతొమ్మిది! రాచనగరుకే దేదీప్యమానమై నెలరాజుగా వెలిగిపోయిన ముంతాజ్ మహల్ పోయిన తర్వాత ఆమెమీది మమకారం చంపుకోలేక లక్షలు ఖర్చుపెట్టి తాజ్‌మహల్ కట్టించి ఆమె భర్త సంతృప్తి చెందగలిగాడేగాని ఆమెను బ్రతికించుకోలేకపోయాడు. మొఘలు చక్రవర్తి. ఆయనకు ధనానికి కొరతా? ఆహారలోపమా? వైద్యులు లేకపోయారా? కాని ఏం లాభం? భార్య పోవడంతో ఆయన జీవితమే దుఃఖభాజనమైంది. వృద్ధాప్యంలో, కన్నకొడుకుచే ఖైదుచేయబడి, 'నా' అనేవారులేక, అమరణాంతం మనోవ్యధచే కృంగి కృంగి, కృశించి జీవితాన్ని చాలించాడు. పెండ్లి చేసుకొనేటప్పుడు మనమెన్నో కలలుకంటాం.

అనురాగం పంచుకొంటూ జీవితాన్ని సుఖమయం చేసుకోవాలని ఉవ్విళ్ళూరుతాం, సంవత్సరం తప్పకుండా పిల్లల్ని కంటూ, ఆరోగ్యంపాడై, నలభై అయినా దాటకముందే అర్ధాంగికి నూరేండ్లు నిండితే మన ఆశాసౌధాలు నేలకూలుతాయి. అధికంగా పిల్లల్ని కనుటచే పాడైన భార్య ఆరోగ్యాన్ని బాగుచేయడానికి చక్రవర్తంతటివాడికే సాధ్యంకాలేదు. మనమంతా ఎంత? మహా గజాలే పలాయనంచిత్తగిస్తే మశకాలేంచేయగలవు?

పిల్లల నెక్కువగా కనేకొద్దీ స్త్రీ తన అవయవ సౌష్టవాన్ని, అందాన్ని త్వరలో కోల్పోతుంది. పరిమిత ఆదాయంఉన్న [illegible]ుం బాలలోనైతే గర్భిణీస్త్రీలకు సరియైన పోషణలేక, ముప్పదిపండ్లు నిండకముందే పండ్లన్నీ రాలిపోతాయి. బోసినోటివారై ముసలమ్మ లలా తయారవుతారు. సంఖ్య యెక్కువయితే కుటుంబంలో సదు పాయాలు సన్నగిలతాయి. మంది యెక్కువైతే మజ్జిగ పల్చన గావాల్సిందేగా? పిల్లలకు చదువు సంధ్యమాట ఏమైంది? రోగం రొష్టు వచ్చినప్పుడు మందుమాకు చూడాలా? పండగపబ్బాలలో బట్టలకనీ, పిండివంటలకనీ బోలెడు డబ్బు పోయాలి. అందులో ఈ కాలంలో పిల్లలుసహితం ఏ నూలుబట్టలతోనూ తృప్తిపడరు. 'స్ట్రెచ్ నైలాను' పేంట్లు కావాలి. టెర్రిలీన్ చొక్కాలు కావాలి. పంజాబీ 'కువ్వాడీస్' కాళ్ళకు కావాలి. మంచి ట్రాన్సిష్టరు (క్రికెట్టు స్కోరు వినడానికి) లేకపోతే కొంపమునిగిపోతుంది. ఈలా పిల్లల అవసరాలు అంతకంతకు ఎక్కువైపోయాయి. వీటన్నిటికీ డబ్బెక్కడనుండి వస్తుంది. 'కొంత హుూత్తు బావగారు, కొంత హుూత్తు బావగారు' అంటూ కొంచెంకొంచెంగా దాచుకున్న వెన్నముద్ద ఖాళీఅయిపోయి నట్లు కొంచెంకొంచెంగా భార్య ఒంటిమీద నగలు మాయమవుతాయి. ఇదే పరిస్థితి కొనసాగితే కొన్నాళ్ళకంతా 'కొంత హుూత్తు' 'అంతా హుూత్త'యి మెళ్ళో మంగళసూత్రంతో ఇల్లాలు మిగిలిపోతుంది.



కళ్యాణ మప్పుడు కన్న కలలు కలలుగానే ఉండిపోవాలా

ఈలాంటి పరిస్థితికి కుటుంబాలు దిగజారకుండా గ్రామంలో పెద్ద లందరూ పూనుకోవాలి.

అనుకోవాలేగాని పరిమితి కుటుంబాలను సాధించడ మిప్పు డేమంత కష్టంగాదు.

గర్భధారణ కనువైన వయస్సుగల భార్యాభర్త లిరువురు, ఒకరిద్దరు పిల్లలైన తర్వాత, 'ఇంతకంటె ఎక్కువమంది పిల్లలు మన కొద్దు' అని త్రికరణశుద్ధిగా దీక్ష వహించాలి. దీన్ని సాధించడానికి ఇద్దరూకలిసి బ్రహ్మచర్యం పాటిస్తే అంతకంటె ఉత్తమోత్తమమైన గర్భనిరోధకమార్గం వేరొకటి లేదు.


చెప్పడం సులభమే. కాని అంతటి మనోనిబ్బరం అందరికీ ఎలా అబ్బుతుంది? ప్రతిప్రాణికి తిండికి తర్వాత సంతానేచ్ఛ గాఢమైంది గదా. సంతానాన్ని వద్దనుకొన్నా కామేచ్ఛను చంపుకోవడ మెంత కష్టం! కాబట్టి, అటు ఆలుమగల కోర్కెలు తీరాలి, ఇటు సంతాన సంఖ్యా పెరగగూడదు-ఈలా ఉభయతారకంగా ఉండడాని కనువైన సదుపాయాలెన్నో ఉన్నాయి. బాహాటంగా మీరీ విషయాన్ని మీ వైద్యునితో సంప్రదించవచ్చును. ఇందు మీరు బిడియపడాల్సిందేదీ లేదు. మగవారికి తగింది మగవారికి, ఆడవారికి తగింది ఆడవారికి – ఆపరేషన్ మొదలు, మింగడానికి బిళ్ళలు, దచ్చికేపులని, 'డ్యూరెక్సు' లని ఎన్నో పరికరాలు, చిట్కాలు ఉన్నాయి. వైద్యులు సంతోషంతో మీకు సలహానిచ్చి సాయపడగలరు. అన్నీ నిరపాయకరమైన మార్గాలే. దీనికంతా డబ్బు ఖర్చు అంటే అదీలేదు. అంతా ప్రభుత్వమే భరిస్తుంది.

'ఇంతాచేసి దురదృష్టవశాత్తు కడుపొస్తే?'

దానికేం, సకాలంలో కనుగొంటే సులభంగా గర్భస్రావం చేసుకోవచ్చు.

ఒకప్పుడు గర్భస్రావం చేసుకోవాలంటే చట్టం ఒప్పేదిగాదు. అలా చేసుకోవడం నేరం. చేసుకొన్నవారూ, చేయించినవారూ శిక్షకు గురిఅయ్యేవారు. గర్భస్రావం శాసనబద్ధం చేయాలని సంకల్పించినప్పుడు, భ్రూణహత్యాపాతకం చుట్టుకుంటుందని, బూజుపట్టిన సిద్ధాంతాలను వల్లించి హేమాహేమీలు హాహాకారాలు చేశారు. శాసనానికి భయపడి రహస్యంగా మంగలి మంత్రసానుల సాయంతో ఎన్ని గర్భస్రావాలయ్యాయో, ఎందరు తల్లుల ప్రాణాలు పోయాయో పట్టించుకొన్నవారెవరు? కామేచ్ఛకు గురియైన పురుషులమూలంగా, కాలుజారిన కన్యలు, కన్నబిడ్డలను కాలువల్లో పారేసినప్పుడు శాస్త్రాలేంజేసినాయి? మతం పేరుతో, మొక్కుబళ్ళ పేరుతో, కడుపుతీపి చంపుకొని కన్నబిడ్డలను గంగపాలు జేసినవారు మనలో లేరా? తెలిసో తెలియకో ఆలస్యంచేసి అంతటి ఘోరాలకిప్పు డొడిగట్టవలసిన పనిలేదు. నిరాఘాటంగా మీరిప్పుడు వైద్యాలయాలలోకి వెళ్ళి మీ అభీష్టాన్ని నెరవేర్చుకోవచ్చు. అన్నివిధాలా మీకు ప్రభుత్వం సాయపడుతుంది.

చిన్న కుటుంబాల నెన్నుకోవడంలో స్వార్థం పరమార్థం రెండూ ఇమిడిఉన్నాయి. మన ఆరోగ్యానికి, సంతోషానికి, సుఖానికి, పరిమిత కుటుంబమే పరమావధి. ఇది స్వార్థం. పెరుగుతూన్న జనాభా మన రాష్ట్రానికేగాదు, మన దేశానికేగాదు ప్రపంచంలోని అన్ని దేశాలను కలవరపెడుతూన్న గడ్డు సమస్య. అన్ని దేశాలలోని అన్ని కుటుంబాలు మన కుటుంబాలవలె చిన్నవయ్యేటట్లు పూనుకొంటే ప్రపంచ జనాభా ఇట్టే పరిష్కారమైపోతుంది. 'సర్వేజనా సుఖినో భవంతు' అని ఊరకే అనడంగాదు; కార్యరూపేణా చేసి చూపినవారమవుతాం. విశ్వకల్యాణానికిదే రాచబాట. ఇది పరమార్థం.




సంసార నౌక

BCI

A0UA102B129




V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
DPRI.
Acc. No.
11161

## మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA102B129 |
| పుస్తకం పేరు | భూభారం పెరిగిపోతూంది |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 57 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | 2,12,2, |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | M. Raji |
| పేజీలు విడదీసినది | M. Raji |
| స్కాన్ చేసినది | Anusha |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |